

# టేకిట్ ఈజీ!! - 4





## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

# మోరల్ స్టోరీ..

**మళ్ళీ మొదలెట్టమని** ఇంటా బయటా ఒహటే పోరు. అంచేత తప్పిందికాదు. ఇంట్లో పోరైతే బైటికి చెక్కేయచ్చు. బైటకూడా పొగెట్టేస్తే మనపని అప్పం అప్పవే కదా. అంచేత మళ్ళీ చెయ్యి చేసుకుంటున్నాను.

"ఇవాళ రేడియోలో, పిల్లలకి ఒక మంచి నీతి కథ చెబుదావనుకుంటున్నానోయ్" అన్నాను ఆవిడతోటి.

"రేడియోలో పిల్లలుంటారాండీ?" అని అడిగింది అమాయకంగా. నాకు ముందురోజు తిన్న ముష్టి తోటకూర పుసులు గబుక్కున పైకి ఎగతన్ని ముక్కులోకొచ్చింది మంట. ఆంబోతులా ముక్కుపుటాలెగరేస్తూ అరిచాను "రేడియోలో పిల్లలుండవేవిటే, వాళ్ళేవన్నా నల్లులా? బల్లులా? పిల్లలు. అయినా నేను పైన చెప్పి చచ్చిన వాక్యంలో రేడియోలో అన్న ముక్క తరువాత ఒక కామా ఏడ్చి చచ్చింది" అన్నాను అవేశంగా.

"చస్తే చచ్చిందిలెండి, అయినా ప్రతి చచ్చినోడిగురించీ నాకెందుకు? మీరున్నారు, అదే చాలు" అంది ఆరాధనగా.

ఇంక నా బీపీ తారాస్థాయిలో పాడుతున్న రఫీ లెవెల్ కి వెళిపోయింది. "అవును, నేనున్నాను, నన్నుకూడా అదాట్న పీకి పిసికేసి మోసేస్తే, పీడా విరగడైపోతుంది. రేపట్నించీ నీకు అరగ్లాసు బియ్యంతో సరి" అన్నాను బుసలుకొడుతూను.

"అబ్బ ఊరుకొందురూ, అరగ్లాసు అరగ్లాసు అని అన్నిమార్లనకండి, తథాస్తు దేవతలుంటారు. అయినా ఈ మధ్యన అరగ్లాసు కన్నా ఓ రెండు గింజలు తక్కువే వేసుకుంటున్నాను నాకు" అంది సంజాయిషీగాను. నాకు ఎప్పటిలాగే కళ్ళు బైర్లు కమ్మాయి, ఆనక గోడని తలకేసుకుని బాదుకున్న ఫీలింగ్ కలిగింది. కాసేపటికి నిమ్మళించింది.

ఇంతలో ఆవిడ పనస తొనలు తీసి తెచ్చి ఇచ్చింది "ఇందండి, తియ్యగా వున్నాయి, తింటే మంచి కథ పడుతుంది" అంటూను.

పదహారేళ్ళ వయసుసినిమాలో చంద్రమోహన్ లాంటి దాని వెఱ్ఱి ప్రేమకి నేను కన్నె వయసులో రోజా రమణిలాగ తడిసి ముద్దయిపోయి, ఆనక ముగ్ధుణ్ణయిపోయి, రెండు తొనలు ఒకేసారి నోట్లో వేసుకుని, ఆనక మాట ముద్ద ముద్దగా వస్తూంటే"లక్ష్మీ, నా జీవిదంలో జేసిన ఒగే ఒగ్గ దప్పు" అంటూంటే,

"తెలుసు, మీ లెక్కల మేష్టారి అమ్మాయికి లవ్ లెటర్ రాయటం" కదా? అంది నవ్వుతూ.

"ఏవిటోనే, ఆ పరమాత్మ నీకు సినిమా నాలెడ్జైనా ఇచ్చుంటే బాగుండేది, మా మాంగారు జేసిన ఒగే ఒగ్గ దప్పు నీకు సినిమాలు చూపించకపోవడం" అన్నాను పళ్ళలో ఇరుక్కుపోయి, రానని మొరాయిస్తున్న పనస పీలికల్ని నా బోడి గోళ్ళతో లాగవతల పారెయ్యడానికి ప్రయత్నిస్తూను.

"సర్లెండి, ఇంతకీ ఐడియా వచ్చిందా, ఏం కథ చెబుతారు, రేడియోలో" అంది.

"నీతి కథ, దేని వల్లనైతే ధర్మం నిలుస్తుందో, దేనివల్లనైతే పంచభూతములు, ప్రకృతి, చంద్రుడు, సూర్యుడు.." అని ఆవేశంగా చెప్పుపోతుంటే అడ్డం కొట్టి "పిల్లలకి ఇలాంటి కథ చెబితే, పారిపోతారు. వాళ్ళకెందుకూ దిక్కుమాల్న నీతులు, పెద్ద పీనుగలే పాటించట్లేదు. హాయిగా ఏ స్టాక్ మార్కెట్ గురించో చెప్పండి, నాలుగు డబ్బులు చేసుకుంటారు" అనేసి కిందకెళిపోయింది.

"ఛీ ఎదవ జీవితం, ఆడాళ్ళు మగాళ్ళు కలిపి ఒక్కళ్ళంటే ఒకళ్ళు ఎంకరేజిమెంట్ చెయ్యట్లేదు కదా. ఇంక ఈ భూమ్మీద ధర్మం ఒంటికాలుతో కాదు, ఒంటి వేలుతో కూడా నిలబడలేదు. ఏది ఏమయినా సరే, నేను నీతి కథ చెప్పి తీరతాను. ఎవడడ్డొస్తాడో చూస్తాను" అని ఆవేశంగా రేడియో సైట్కి లాగిన్ అయ్యాను.

"సార్ ఇవాళ మీకు స్పెషల్ ఆడియన్స్ ఉన్నారుసార్. ముదు మీ కథ వాళ్ళు అప్రూవ్ చేసాకానే టెలికాస్ట్ చేస్తాం. త్వరగా చెప్పండి" అన్నాడు టెక్నీషియన్ కుర్రాడు.

"నా కథకి ఎప్రూవల్సా, ఎవరక్కడ, ఆసేతుహిమాచల పాద పర్యంకాఖిల మహీ మండల ధరణీ ధరాది పదాక్రాంత ప్రతాపోన్మత్త విస్పుట స్ఫుట నటనా చాతురీ పారంగ మహోత్తుంగ.." అని ఆవేశపడి ఇచ్చిన గేప్ లో కుర్రాడన్నాడు "వాళ్ళు ఎలక్షన్ అధికారులు సార్, వాళ్ళ అప్రూవల్ లేనిదే, ఎవళ్ళూ ఏమీ చెయ్యలేం. ఎలెక్షన్ కోడ్ అమలులోకొచ్చింది మరి" అన్నాడు విశదీకరిస్తూను.

"తప్పదా" అన్నాను దీనంగా.

"తప్పి పూడుస్తే, మేమెంగె పూడ్చికోవాలే తంబీ " అని ఒక గొంతూ, "సహీ బోలా, హం సున్ కే బతాతేహై" అని ఒక గొంతూ, "త్వరగా చెప్పండి సార్, అవతల మాకు బోల్డు పనులున్నాయి" అని మరో గొంతు వినబడ్డాయి. కాగల కార్యం కమీషన్ వాళ్ళు చెడగొట్టారని కించిత్తు వగచి, విధి లేక, పిల్లల నీతి కథ మొదలెట్టాను.

"అనగా అనగా ఒక ఊళ్ళో రామయ్య, రంగయ్య ఉన్నారు".

"సార్ అబ్జెక్షనొచ్చింది సార్" అన్నాడు కుర్రాడు. "ఓరి నీ బొడ్డు పొక్క దీనిలో అబ్జెక్షనేట్రా"? అన్నాను చిరాగ్గా. ఆ వూరి పేరు రామాపురం కద సార్. అక్కడ రామయ్య రంగయ్య ఎం.ఎల్.యే కేండిడేట్లుసార్, మార్చెయ్యాల్సిందే. సరే మళ్ళీ మొదలెట్టాను " అనగా అనగా ఒక దీవిలో అజ్మాత్ ఖుద్రత్ ఇస్మాయిల్ జెహాన్ ఇంకా నౌషిన్ జెహోవా స్పార్క్ బ్రచూటా అని ఇద్దరు అన్నదమ్ములున్నారు. మళ్ళీ అబ్జెక్షనన్నారు. ఏవిటి అని అడిగాను.

"ఈ పేర్లు మన దేశంలో పోటీ చేసే ఏ అభ్యర్థితోటీ కలవటం లేదు కాబట్టి ఓ.కే. కానీ వాళ్ళిద్దరూ అన్నామ్ములంటున్నారు, అసలు ఏమాత్రం పొంతనలేకుండా అలా ఎలా పెట్టారు సార్ వాళ్ళ పేర్లు" అని అడిగారు వాళ్ళు.

పేరెంట్స్ అన్నాకా సవాలక్ష కారణాలుంటాయి. వాళ్ళ ఫామిలీ లొసుగులు మనకెందుకు, కథ వినండి. వాళ్లల్లో అజ్మాత్ ఖుద్రత్ ఇస్మాయిల్ జెహాన్ పెద్దవాడు. వాడి పుట్టిన రోజుకి వాళ్ళనాన్న ఒక సైకిలు కొనిచ్చాడు.

"అబ్జెక్షన్..సైకిలెలా కొంటారు సార్, చూస్తూ చూస్తూను, తప్పు కదూ, కోడ్ వయొలేషన్" అన్నారు.

"పిల్లాడికి సైకిల్ కాకపోతే కార్లూ, హెలికాప్టర్లూ కొంటారా సార్" అని అరిచాను.

"హన్నన్న, అవి కూడా తప్పే, వల్లకాదు" అన్నారు వాళ్ళు.

"సరే, వాళ్ళ బాబు పెద్దాడి పుట్టిన రోజుకి వాడికి రెండు జీళ్ళు కొన్నాడు. రెండో వాడికి కాగితం ఫేన్ కొన్నాడు సరా" అన్నాను.

"సార్, బాబు అనకుండా, నాన్న అనండి, కాగితం ఫేన్ బదులు, కాగితం పడవ అనండి, కంటిన్యూ..." అన్నారు. పెద్దవాడు చిన్నాడితో జీడి షేర్ చేసుకున్నాడు. చిన్నవాడు పెద్దాడితో పడవ షేర్ చేసుకున్నాడు. ఆపడవలో వాళ్ళిద్దరూ గోదాట్లోకి దూకి, విహార యాత్రకెళ్ళారు.

"సార్, ఇంతవరకూ ఓకే. కానీ విహారయాత్ర, ఇరిగేషన్ ప్రాజెక్టు అనకండి సార్, గొడవొస్తుంది..".

"సరే, వాళ్ళిద్దరూ గోదాట్లో విహార యాత్ర చేసి"...."సా... సార్ర్,, యాత్రేవిటి సార్, పాద యాత్ర లాగ, పిక్నిక్ అనండి సార్, పిక్నిక్ అనండి సార్" అని ఏడ్చేసారు.

సరే కాగితపడవలో పిక్నిక్ చేసుకుని రేవు గట్టుకొచ్చారు. ఆకాశం గులాబీ రంగులో ఉంది. సూరుడు పసుపు రంగులో ఉన్నాడు. "అయ్యబాబోయ్, సార్, మనకెందుకొచ్చిన దిక్కుమాల్న ప్రకృతి వర్ణనలు సార్, మీరేవన్నా వాల్మీకా, కాళిదాసా, జస్ట్ కథ చెప్పండి సార్.." అని ప్రాధేయపడ్డారు.

"ఛీ, మరీ దైద్రం పాడైంది" అనుకుని "సరే, తడిసిపోయిన పడవ దండెమ్మీద ఆరేసి, వాళ్ళిద్దరూ ఇంటికొచ్చి అలిసిపోయి ఫేను గాలికింద కూర్చుని, "సార్, విసనకర్రలు బెటర్ సార్, లేకపోతే, ఆరుబైట, కొబ్బరి చెట్ల క్రింద కూర్చుని రిలాక్స్ అవుతున్నారని రాయండి సార్..".

"సరే, అలా రిలాక్స్ అవుతున్నప్పుడు పైనించి ఒక కొబ్బరికాయ పడి నౌషిన్ జెహోవా స్పార్క్ బ్రచూటా గాడి బుర్ర ఫటిక్కని పగిలిపోయింది. అది చూసి, అన్న ఐనటువంటి అజ్మాత్ ఖుద్రత్ ఇస్మాయిల్ జెహాన్ గాడు భోరు భోరున గుండెలు అవిసేలా విలపిస్తూ "తమ్ముడూ, నౌషిన్ జెహోవా స్పార్క్ బ్రచూటా, నీకు అప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా? అప్పుడే నన్నొదిలేసి వెళ్ళిపోయావా, అప్పుడే...అప్పుడే" అంటూంటే, అప్పుడే ఇవతల చెట్టుమీంచి ఇంకో కొబ్బరికాయ పడి  అజ్మాత్ ఖుద్రత్ ఇస్మాయిల్ జెహాన్ గాడి బుర్ర కూడా భడేల్ మంది. వాడూ బాల్చీ తన్నేసాడు." కాస్త గేప్ ఇచ్చి, ఆగాన్నేను.

"తరువాత"అన్నాయి అవతలి కంఠాలన్నీని. "తరువాతేముంది, వాతే, కథ అయిపోయింది" అన్నాను కరుకుగా.

"అదేంటి, నీతి కథ అన్నారు?" అన్నాడు ఒక పక్షి.

"హాన్, ఆప్ కో ఇస్మే క్యా మోరల్ మిల్తా హై" అన్నాడు ఇంకో తీతువు. "సర్, నిజం చెప్పాలంటే నాక్కూడా అర్థం కాలేద్సార్" అన్నాడు టెక్నీషియన్ కుర్రాడు. "మరదే, దీనిలో నీతేమిటో చెప్పుకోండి, బుర్ర వాడండి" అన్నాను నేను వాళ్ళని రెచ్చగొడుతూను.

"సార్, రిలాక్స్ అవడానికి కొబ్బరి చెట్ల క్రింద కూచోకూడదు" ఇది ఒక మోరల్ సార్."అన్నాడు కుర్రాడు. "కరెక్ట్, ఇంకా కొన్ని మోరల్స్ ఉన్నాయి" అన్నాను నేను ఉత్సాహంగా.

"ఒకడి తల పగిలిపోతే, వాణ్ణి పూర్తి పేరుతో పిలుస్తూ, అక్కడే ఏడుస్తూ కూర్చుంటే, మనకి కూడా పుచ్చె లేచిపోద్ది" ఇది కరెక్టేనా సార్" అన్నాడు ఒక పక్షి.

"ఆల్మోస్ట్ కరెక్ట్". కానీ అసలైన మోరల్ ఎలెక్షన్లు అయ్యాకా చెబుతా, ఉంటా" అని లాగ్ ఆఫ్ అవబోతూ ఉంటే, వాళ్ళందరూ ప్రాధేయపడుతూ " సార్, ఈ టెనషన్ అప్పటిదాకా తట్టుకోలేం సార్..దయ చేసి చెప్పేయండి సార్, మోరల్ ఏవిటి? మోరల్ ఏవిటి" అన్నారు దీనంగా.

"మోరలా, ఏవుందీ, ఎప్పుడు చెయ్యాల్సిన పని అప్పుడు చెయ్యాలి, గెలలు కనిపించినప్పుడు సుబ్బరంగా కొబ్బరి చెట్లకి దింపు తియ్యాలి, లేకపోతే డేంజరు" అనేసి పారిపోయా.

ఇది జరిగి ఇప్పటికి కొన్ని రోజులైంది. వాళ్ళిపట్లో కోలుకునేలా లేరు.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS